కోడిగుడ్డులాంటి ముఖం. కోటేరులాంటి ముక్కు, కలువ రేకుల్లాంటి 'ఐటెక్స్' కళ్ళు, గోల్డ్ స్పాట్ చాక్‌లెట్ లాంటి చెక్కిళ్ళు, కుడి చెక్కిలిపై ఆవగింజంత పుట్టుమచ్చ. అబ్బ! ఎంత అందంగా ఉందీ కుసుమ కోమలాంగి! నిజంగా ఇటువంటి అపూర్వ సౌందర్య రాశి తన అర్ధాంగి అయితే! పాకంకారే జిలేబి చుట్టూ తిరిగే ఈగల్లా ఆమె చుట్టూ తిరుగుతున్నాయి బుచ్చిబాబు కళ్ళు.

"నీ పేరేమిటమ్మా?" బుచ్చిబాబు తండ్రి—సీతాపతి అడిగాడు.


"సుబ్బలక్ష్మి."

"వెరీ స్వీట్ నేమ్!" మురిసిపోయాడు బుచ్చిబాబు.

"ఏం చదువుకున్నావు?"

"బి. ఏ."

సుబ్బలక్ష్మి పెద్ద చదువు చదివిందనేసరికి



# పెళ్ళిచూపులు

కొటభ్రూర్తి శ్రీమూర్తి సత్యనారాయణ

బుచ్చిబాబు అక్క సావిత్రికి ఒక పెద్ద అనుమానం వచ్చి వెంటనే అడిగేసింది — "నీకు వంటొచ్చా?" అని.

"వచ్చు."

హమ్మయ్య ఇన్నాళ్ళకి తన తమ్ముడికి హోటల్ భోజనం తప్పుతుంది — తృప్తిగా గాలి పీల్చుకొని—

"పాటలొచ్చా?" అని అడిగింది.

"రావండి."

ఇక ఏం అడగాలో తోచక —

"అదేమిట్రా బుచ్చీ! అలా చూస్తావు? అమ్మాయి నేమయినా అడుగు" అంటూ తన మోచేత్తో

ప్రక్కన కూర్చున్న బుచ్చిబాబుని డొక్కలో పొడిచింది సావిత్రి.

నిద్రలోంచి లేచిన వాడిలా ఉలిక్కిపడి — "ఇహి, హి, హి! నేనేం అడగను? అన్నీ నువ్వే అడుగుతున్నావుగా, అడుగు! ..." డొక్కని చేత్తో రాసుకుంటూ అన్నాడు బుచ్చిబాబు.

నిజానికి బుచ్చిబాబుకి సుబ్బలక్ష్మితో పర్సనల్‌గా ఏవేవో, ఎన్నెన్నో మాట్లాడాలని ఉంది. కానీ, ధైర్యంచేసి అడకలేక పోతున్నాడు.

"ఇక లోపలకు తీసుకు వెళ్ళవచ్చు" అన్నాడు సీతాపతి.

"ఆయనతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి. లోపలికి పంపిస్తారా?" సీతాపతిని అడిగింది సుబ్బలక్ష్మి.

"ఈ రోజుల్లో కుర్రకారుకి ఇదో ఫేషన్ అయిపోయిందండీ ..." నవ్వుతూ అంటూ బుచ్చిబాబుని వెళ్ళమన్నట్టుగా కళ్ళతో సైగ చేశాడు సీతాపతి.

మగవాడైయుండి, తనకి లేని ధైర్యంతో ఆమె అడిగినందుకు సిగ్గుపడ్డాడు ... అయినా, వెంటనే సంతోషించి, సుబ్బలక్ష్మి వెనకే లోపలకు వెళ్ళాడు బుచ్చిబాబు.

"కూర్చోండి!" గదిలోకి తీసుకు వచ్చి, కుర్చీ చూపిస్తూ అంది సుబ్బలక్ష్మి.

ఇదేమిటి? పర్సనల్‌గా మాట్లాడతానని చెప్పి, పదిమంది ఉన్న గదిలోకి తీసుకువచ్చిం దేమిటి? ... పదిమంది అమ్మాయిల వైపు బేలగా చూస్తూ కూర్చున్నాడు బుచ్చిబాబు.

"ఈయనే నా కాబోయే శ్రీవారు? అమితాబ్‌లా ముచ్చటగా ఉన్నాడు" అందొక అమ్మాయి.

"ఈవిడ డాక్టరు మాధవి ..." అంటూ ఒక అమ్మాయిని పరిచయం చేసింది సుబ్బలక్ష్మి.

పెళ్ళి, గిళ్ళీ కాకుండానే 'ప్రసూతికోణం' గురించి లెక్చరు చెప్పించడానికా డాక్టరుతో పరిచయం చేసింది ... వెంటనే కర్తవ్యం గుర్తుకు వచ్చి—

"నమస్కారం" అన్నాడు బుచ్చిబాబు.

"వీళ్ళంతా నా క్లాస్‌మేట్స్! ... లత, పార్వతి హేమా, తులసి, కృష్ణవేణి, లక్ష్మి ..." అంటూ అందర్నీ పరిచయం చేసింది సుబ్బలక్ష్మి.

అందరికీ నమస్కారాలు పెట్టేశాడు. వీళ్ళంతా ఎప్పుడు బయటకు పోతారు, ఎప్పుడు సుబ్బలక్ష్మితో ఫ్రీగా మాట్లాడదామా అనే ఉబలాటగా ఉంది బుచ్చిబాబుకి.

"మీ క్వాలిఫికేషన్ ఏమిటండి?" అడిగింది డాక్టర్ మాధవి.

"బి. కాం."

"ఏం చేస్తున్నారు?"

"మున్సిపల్ ఆఫీసులో యు. డి. సి. గా పని చేస్తున్నాను."

"స్పెట్స్ పెట్టుకున్నా రేమిటి? చత్వారం ఉందా మీకు?" అంటూ చొరవగా బుచ్చిబాబు కళ్ళజోడు తీసి పరీక్ష చేయసాగింది డాక్టర్ మాధవి.

సుబ్బలక్ష్మితో సహా అంతా గొల్లుమన్నారు.

"అబ్బే! అదేం లేదండీ? ..." అంటూ మాధవి దగ్గరున్న కళ్ళజోడు తీసుకోబోతూ అన్నాడు బుచ్చిబాబు.



నా పే ... ఫోటో: జి. గోపాలకృష్ణ

"మరి? ... హెడేటాక్కా? ... కళ్ళజోడు బుచ్చిబాబుకి అందనివ్వకుండా దూరంగా జరిగి ఇంకా పరీక్షచేస్తూ అడిగింది మాధవి.

సుబ్బలక్ష్మి — తనక్కాబోయే అర్ధాంగి ఫ్రెండు కదా — ఏం చదువుకున్నావ్? ఏం చేస్తున్నావని అడిగింది. తను చెప్పేడు. కానీ, పరీక్ష లేమిట్రా బాబూ? ... అని అనుకొని —

"అబ్బెబ్బే! నా కటువంటి వేం లేవండీ! ... 'షో'గా పెట్టుకున్నా — అంతే! ..." అంటూ డాక్టర్ మాధవి దగ్గరున్న కళ్ళజోడు లటుక్కున లాగేసుకున్నాడు.

"ఇంత 'బెల్' పెట్టించా రేమిటి? బోదకాలు ఉందా? ..." అంటూ ప్యాంటు మోకాలి పై వరకూ లాగింది డాక్టర్ మాధవి.

పేంటు ఎత్తుతుంటే తేలుకుట్టిన వాడిలా గబుక్కున కాలు పైకెత్తాడు ... కుర్చీ చెంప్యై పొడుగ్గా ఉండేమో, మోకాలు మీద గట్టిగా తగిలేసరికి — "అబ్బా!" అని మూలుగుతూ మోకాలు పట్టుకున్నాడు బుచ్చిబాబు.

మళ్ళీ గొల్లుమన్నా రంతా.

బుచ్చిబాబు ముఖం మాడిపోయిన దోసెలా అయింది.

మనసు అవమానంతో కుతకుత లాడిపోతుంది. కానీ, ఏమీ అనడానికి ధైర్యం చాలడం లేదు.

"హార్ట్ ఎటాక్, షుగర్ కంప్లైంట్స్ ఉన్నా ఏమో ఒక సారి చెక్ చేయండి డాక్టర్!..." అంది సుబ్బలక్ష్మి.

"అబ్బే! నా కటువంటి జబ్బులేం లేవండీ!..." అన్నాడు కుర్చీలోంచి లేచిపోతూ.

"ఫూ ... లేవకండి! ... అయినా మాకు కొన్ని అనుమానాలుంటాయి కదండి!" అంటూ బుచ్చిబాబుని కుర్చీలో కూర్చోబెట్టి, "ఊ, చెక్ చెయ్యండి, డాక్టర్!" అంది సుబ్బలక్ష్మి.

స్టెతస్కోపుతో పరీక్ష చేయసాగింది డాక్టర్ మాధవి.

మళ్ళీ అమ్మాయిలంతా గొల్లుమన్నారు.

మయసభలో దుర్యోధనుడులా ఫీలయ్యాడు బుచ్చిబాబు.

అవమానంతో ముఖం డేంజర్ లైటులా ఉంది.

"పర్సనల్‌గా మాట్లాడతానని తీసుకొచ్చి, ఈ పరీక్ష లేమిటండీ? ..." సుబ్బలక్ష్మిని సీరియస్‌గా అడిగాడు బుచ్చిబాబు — ఇందాకట్నుంచీ లేని ధైర్యం ఇప్పు డెలా వచ్చిందో?!

"మేం మిమ్మల్ని కొనుక్కుంటున్నాం!" అంది సుబ్బలక్ష్మి కూడా సీరియస్‌గా.

"వాట్? ... నన్ను — మీరు — కొనుక్కుంటున్నారా?! ..." నోరు తెరిచి, క్వశ్చన్ మార్కు ముఖం పెట్టాడు బుచ్చిబాబు.

"అవునండీ! మా నాన్నగారు కట్నం ఇస్తున్నారుగా!"

కట్నం ఇవ్వడమంటే అనాదిగా వస్తున్న ఆచార మనుకున్నాడే గాని, ఫేన్సీ షాపులో వస్తువులా అమ్ముడు పోవడ మనుకోలేదు ... అందుకే కాబోలు ఇందాకట్నుంచీ బజార్లో పుచ్చొంకాయలా పరీక్ష చేస్తున్నారు తనని! ...

"మొన్న అప్పన్న పేట వాళ్ళు ఇరవై వేలు ఇస్తామన్నారు ..." అంటూ సీతపతి సుబ్బలక్ష్మి తండ్రితో ఇంకా ఏదో చెప్పబోతున్నాడు.

"నాన్నా!"

అక్కడేదో బాంబు ప్రేలినట్టు అటు తిరిగి చూశారంతా.

గుమ్మానికి అడ్డు నిలబడి ఉన్నాడు బుచ్చిబాబు.

"ఏరా, ఏమయింది?" అడిగాడు సీతాపతి.

"పైసా కట్నం తీసుకోకుండా ఈ పెళ్ళి చేసుకుంటాను!" దృఢ నిశ్చయంతో అన్నాడు.

కొడుకు చదువుకోసం అయిన ఖర్చంతా వడ్డీతో సహా కట్నంగా రాబట్టుకోవాలనుకున్న సీతాపతి—

తమ్ముడి పెళ్ళిలో ఆడపడుచు కట్నం, ఇంకా లాంఛనాలు సునంగా పొందా లనుకున్న సావిత్రి.

'బుచ్చీ! ..." తమ ఆశా సౌధాలు పేకమేడల్లా కూలిపోతుంటే, అయోమయంగా ఇద్దరూ ఒక్కసారిగా అన్నారు.

"అవును! కట్నం తీసుకొని నన్ను నేను అమ్ముడు పోవడం నా కిష్టం లేదు ... నే నీమెను తప్ప మరెవరినీ పెళ్ళి చేసుకోను."

"నన్ను కాదని ఈ పెళ్ళెలా చేసుకుంటావో నేనూ చూస్తాను!" సీతాపతి నరసింహావతారం ఎత్తాడు.

అప్పటికే గుమ్మం దగ్గరికి వచ్చి ఇదంతా చూస్తున్న సుబ్బలక్ష్మి — ఫ్రెండ్స్ దగ్గరికి వచ్చి "థాంక్స్, సుబ్బలక్ష్మిగారూ! పశువుగా అమ్ముడు పోకముందే మనిషిని చేశారు ... మీ నాన్నగారిని త్వరగా ముహూర్తం పెట్టించెయ్య మనండి! ..." అని చకచకా బయటకు వెళ్ళిపోయాడు బుచ్చిబాబు.

*